ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
బుధవారం 17 ఏప్రిల్ 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 25.0

జనం విలవిల

జగన్ బస్సు యాత్ర, సభకు పాట్లు

- మండుటెండకు అల్లాడిన ప్రజలు
- అడుగడుగునా ట్రాఫిక్ నిలిపివేత
- గంటల తరబడి వాహనదారుల అవస్థలు
- రోడ్డుపై చెట్ల నరికివేత.. విద్యుత్ వైర్ల తొలగింపు.. సరఫరా నిలిపివేత
- ఆర్టీసీ బస్సులు భారీగా తరలింపు.. ప్రయాణికుల గగ్గోలు
- భీమవరం సభకు జనసమీకరణ కష్టాలు
- తణుకు మండలం తేతలిలో రాత్రి బస



ఉండిలో సీఎం బస్సు యాత్ర

నిడమర్రు/గణపవరం/ఉండి/భీమవరం క్రైం/ఇరగవరం/పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16 : మండు టెండలో జగన్ బస్సు యాత్ర ప్రజలకు చుక్కలు చూపించింది. జగన్ వస్తూ హాయ్ అని చెప్పుకొంటూ వెళ్లారు కానీ.. ఉదయం నుంచి వేచి చూసిన మాకు నరకం చూపించారని స్థానికులు, కిరాయి కార్యకర్తలు తిట్టుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నారాయణపురం నుంచి మంగళవారం ఉదయం మొదలైన సీఎం జగన్ బస్సు యాత్ర నిడమర్రు, గణపవరం, ఉండి, భీమవరం, పెంటపాడు మండలం చిలకంపాడు లాకుల వద్ద, చింతపల్లి, రావిపాడు, ముదునూరు మీదుగా తణుకు మండలం తేతలి చేరుకుంది. నిడమర్రు మండలంలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు బస్సుయాత్ర షెడ్యూల్ ప్రకారం రావాల్సి ఉండగా ఐదు గంటలు ఆలస్యంగా మండు వేసవిలో ఒంటి గంట సమయంలో జగన్ బస్సు నిడమర్రుకు చేరుకుంది. అప్పటి వరకు కార్యకర్తలు, నాయకులు మండుటెండను తట్టుకోలేక చెట్ల నీడలో, రోడ్డు పక్క షాపుల వరండాల్లో వేచి ఉంటూ ఇబ్బందులు పడ్డారు. జగన్ బస్సు యాత్ర పేరుతో రోడ్డుకు ఇరువైపులా వున్న చెట్లను నరికివేశారు. విద్యుత్ వైర్లను పూర్తిగా కట్ చేశారు. జగన్ యాత్ర వెళ్లాక మండుటెండలో విద్యుత్ సిబ్బంది వాటిని పునరుద్ధరించాల్సి వచ్చింది. ఉదయం ఐదు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిడమర్రు మండలంలో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇన్వర్టర్‌లు ఖాళీ కావడంతో ఫ్యాన్లు మొరాయించాయి. ఉదయం నుంచి విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలో మోటార్లు పనిచేయక, నీటిసరఫరా లేక ఇబ్బందులు పడ్డారు. ఐస్ ఫ్యాక్టరీల్లో ఐస్ పూర్తిగా కరిగిపోయి నష్టపోయారు. సీఎంకు దివ్యాంగులు తమ పెన్షను నెలకు నాలుగు వేలకు పెంచాలని, కొల్లేరు సమస్య పరిష్కరించాలని, న్యాయం చేయాలంటూ కొంత మంది నాయకులు వినతి పత్రాలు అందజేశారు. మందలపర్రులో జగన్ బస్సు దిగి ప్రజలకు అభివాదం చేశారు. భువనపల్లిలో వేచిచూసిన ప్రజానికానికి బస్సులో నుంచే హాయ్ చెబుతూ ముందుకు సాగారు. గణపవరం మండల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలుపుదల చేయడంతో ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సందిట్లో సడేమియా అన్న చందంగా జేబు దొంగలు పెట్రేగిపోయారు. పలువురు బాధితులు లబోదిబోమన్నారు. ఉండి మండలం ఆరేడు, పాందువ్వ రోడ్, కోలమూరు, ఉప్పులూరు రోడ్, పాములపర్రు, ఉండి ప్రధాన సెంటర్, ఎస్ఆర్పీ అగ్రహారం మీదుగా సాగింది. ఉండి సెంటర్‌లో జగన్ మాట్లాడతారని అంతా అనుకున్నప్పటికీ బస్సుపైకి ఎక్కి అభివాదం చేసుకుం టూ వెళ్లిపోవడంపై



నిడమర్రులో మండుటెండలో జనం



ఉండి : ఎండలో పోలీసుల పాట్లు

కార్యకర్తలు నిరాశ చెందారు. మండు టెండలో పలువురు రోగులు వినతిపత్రాలు అందించేందుకు ప్రయత్నించారు.

స్తంభించిన వాహనాలు

సీఎం బస్ యాత్ర, సిద్ధం సభల సందర్భంగా దారిపొడవునా ట్రాఫిక్ భారీగా స్తంభించింది. భీమవరం బైపాస్ రోడ్డు, గరగపర్రు రోడ్డు, నర్సయ్య అగ్రహారం ప్రాంతాల్లో గంటలకొద్దీ వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. దూరప్రాంతాల నుంచి సభకు వచ్చిన వాహనాలతోపాటు, ప్రయాణికుల వాహనాలు నిలిచిపోయాయి. సభ అనంతరం సీఎం తాడేపల్లిగూడెం రోడ్డులో వెళుతున్న నేపథ్యంలో దానిని కొంతసేపు మూసివేశారు. సభ ప్రారంభం కాగానే వచ్చిన వారందరూ వెనుదిరిగారు. పోలీసులు చేసేదేమి లేక చేతులెత్తేశారు. రద్దీ ప్రాంతాలలో గణపవరం మండలం సరిపల్లె ప్రాంతానికి చెందిన వ్యక్తి కాలుపై నుంచి కారు వెళ్లడంతో అతడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఉండి మండలంలో ఉండి నుంచి భీమవరం వెళ్లే



ప్రసంగం ప్రారంభమైన

పావు గంటకే జనం తిరుగుముఖం

- సిద్ధం సభలో అధిక భాగం చంద్రబాబు, పవన్‌లపై విమర్శలకే జగన్ ప్రాధాన్యం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరంలో వైసీపీ నిర్వహించిన మేం సిద్ధం సభలో విమర్శలు గుప్పించేందుకే సీఎం జగన్ ప్రాధాన్యం ఇచ్చారు. సభలో తొలి పలుకు నుంచే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారు. సభకు జనాన్ని తరలించడానికి పార్టీ జిల్లా నేతలు ఆపసోపాలు పడ్డారు. డ్వాక్రా సీఏలను ఉపయోగించుకున్నారు. మహిళలను రప్పించారు. జనాన్ని బస్సుల్లో తరలించడంలో నేతలు ఒకింత కష్టపడ్డారు. కానీ సభ ప్రారంభమైన కొద్దిసేపటికే వచ్చిన జనం తిరిగి వెళ్లిపోవడం కనిపించింది. అనుకున్న సమయంకంటే అరగంట ఆలస్యంగా సభ ప్రారంభమైంది. భీమవరం సిద్ధం సభా ప్రాంగణానికి సీఎం సాయంత్రం ఐదు గంటలకు చేరుకున్నారు. అప్పటికే సభా ప్రాంగణం భర్తీ అయిపోయింది. తొలుత భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. తర్వాత సీఎం ప్రసంగాన్ని ప్రారంభించారు. పావుగంట మాట్లాడేసరికి సభలో వున్న జనం తండోపతండాలుగా వెనక్కితిరిగి వెళ్లిపోయారు. కేవలం నాలుగు బ్లాకుల్లో మాత్రమే జనం ఉన్నారు. ఆయన ఉపన్యాసమంతా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపైనే సాగింది. వారివురిపైనా వ్యక్తిగత దూషణలకు ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాకు తాము ఏమి చేస్తాననేది చెప్పలేదు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి, ప్రజలకు ఏం చేస్తామనే విషయాన్ని చెప్పలేదు. తాను రాకపోతే గడచిన 58 నెలల్లో అమలుచేసిన సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయంటూ చంద్రబాబుపై విమర్శనాస్త్రాలు సంధించారు. అబద్ధపు వాగ్దానాలతో ప్రజల ముందుకు చంద్రబాబు వస్తున్నారంటూ ఆరోపించారు. తాడేపల్లిగూడెం నుంచి మంత్రి కొట్టు సత్యనారాయణ పోటీ చేస్తున్నారని ప్రకటించడంతో ఇప్పటి వరకు ఈలి నానికి టిక్కెట్ ఇస్తారన్న ప్రచారానికి తెరపడింది.



సీఎం ప్రసంగిస్తుండగా వెళ్లిపోతున్న జనం



భీమవరంలో నిలిచిన ట్రాఫిక్



పెంటపాడు మండలం చిలకంపాడు లాకుల వద్ద నిలిచిన ట్రాఫిక్‌లో వాహనదారుల ఇబ్బందులు



ఉండిలో నిలిచిన ట్రాఫిక్

రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పెంటపాడు మండలంలో సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో పోలీసు ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం కాన్వాయ్ పెంటపాడు మండలంలోకి ప్రవేశించకముందే గంటకుపైగా వాహనదారులను చిలకంపాడు లాకుల వద్దే నిలిపివేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేసవి వాతావరణం కావడంతో ద్విచక్రవాహనాలపై ఉన్న చిన్నారులు, గర్భిణీలు, మహిళలు నరకాన్ని చవిచూసారు. సీఎం కాన్వాయ్ చిలకంపాడు లాకుల మీదుగా కాశిపాడు మలుపు తిరిగేంత వరకు పోలీసులు వాహనదారులను ముందుకు సాగనివ్వలేదు.

సీఎం సభకు డబ్బులు ఇవ్వకుండా మోసం !

పాలకొల్లు : ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్న చందాన తయారైంది వైసీపీ కార్యకర్తల పరిస్థితి.. భీమవరంలో జగన్ సభకు పాలకొల్లు, పరిసర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించడానికి వందలాది బస్సులు ఏర్పాటుచేశారు. కొన్ని బస్సుల్లో సీటుకు ఒక్కరే ఉండగా, మరి కొన్నింటిలో ఐదింట నాలుగో వంతు ఖాళీగా కనిపించాయి. సభకు తరలివెళ్లిన పలువురు తమకు డబ్బులు ముట్టలేదంటూ బహిరంగంగానే గగ్గోలు పెడుతున్నారు. తమను సమీకరించిన ప్రాంతానికి చెందిన కార్యకర్తలకు ఫోన్ చేసి సొమ్ములు ఇప్పించాలని ప్రాధేయ పడుతున్నారు. డబ్బులు ఇస్తే ఒక క్వార్టర్ కొనుక్కొని ఇంటికి వెళతాము. ఆలస్యమైతే బ్రాందీ షాపులు మూసి వేస్తారంటూ ప్రాధేయ పడడం కనిపించింది. మండుటెండలో వెళ్లమని, సభకు వెళితే బిర్యాని ప్యాకెట్‌తో పాటు, ప్రాంతాన్ని బట్టి రూ.300 నుంచి రూ.500 ఇస్తామని హామీ ఇచ్చిన నాయకులు తాము తిరిగి వచ్చి బస్సు దిగే సమయానికి పరారయ్యారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం క్వార్టర్ మందుకు డబ్బులు వస్తాయని, పని మానుకుని పార్టీ జెండా పట్టుకుని వెళితే చివరకు ఇంత పొడుగున చూపించారని ఒక భవన నిర్మాణ కార్మికుడు వాపోయాడు. జన సమీకరణలో సకాలంలో సొమ్ములు ఇవ్వక పోవడంతో పార్టీకి చెందిన పలువురు ఇబ్బందులు పడినట్టు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.



- సచివాలయం వద్దకే సిద్ధం బస్సులు

భీమవరంలో జరిగే సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించి సచివాలయాల వద్ద, సొసైటీల వద్ద, ఆర్‌బీకేల వద్ద ఉంచారు. పెంటపాడు మండలం కె.పెంటపాడులో సచివాలయం వద్ద సిద్ధం సభకు జనాన్ని తరలించే బస్సును ఉంచారు. ఎన్నికల కోడ్ సమయంలో సచివాలయం వద్ద ఒక పార్టీ కార్యక్రమానికి వెళ్లే బస్సులను ఎలా ఉంచుతారని విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై సచివాలయం అధికారులను వివరణ కోరగా బస్సులు ఇక్కడ పెట్టకూడదా అని వారు తిరిగి ప్రశ్నించారు.



- ఆలయానికి వైసీపీ జెండాలు

సీఎం బస్సు యాత్ర నేపథ్యంలో నాయకులు ఆలయాలను వదలలేదు. పెంటపాడు మండలం రావిపాడు సెంటర్‌లోని వినాయకుని ఆలయ గోడకు వైసీపీ జెండాలను కట్టేశారు.



- చెట్ల కొమ్మల తొలగింపు

చిలకంపాడు లాకుల వద్ద నుంచి కాశిపాడు, రావిపాడు గ్రామాల మీదుగా వెళ్తున్న రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించారు. చింతపల్లి గ్రామ సమీపంలో ఎంతోమందికి నీడనిచ్చే మర్రిచెట్టు కొమ్మలను నరికేశారు. చిలకంపాడు లాకుల నుంచి కాశిపాడు, రావిపాడు గ్రామాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేసేశారు.



తణుకు బస్టాండ్‌లో

- బస్సులు లేక ఇక్కట్లు

భీమవరంలో సీఎం జగన్ నిర్వహిస్తున్న సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు నాయకులు అపసోపాలు పడ్డారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా మండలం నుంచి సభకు వెళ్లేందుకు ప్రజలు సరిగా మక్కువ చూపలేదు. చాలా బస్సులు అంతంతమాత్రంగా జనాన్ని వేసుకుని ఖాళీగానే వెళ్లాయి. ఈ సభకు జనాన్ని తరలించేందుకు మొత్తం 939 బస్సులను వినియోగించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం డిపో నుంచి 45, నరసాపురం 30, తణుకు 40, తాడేపల్లిగూడెం 25 వెరసి మొత్తం 140 బస్సులు ఉన్నాయి. ఏలూరు జిల్లా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి 100 బస్సులను వినియోగించారు. ఆర్టీసీ సర్వీసులను పెద్ద సంఖ్యలో రద్దు చేయడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఓ వైపు శుభకార్యాలు ఉండడంతో బస్టాండ్‌లకు వచ్చి గంటల తరబడి నిరీక్షించారు. ఓ వైపు ఎండ వేడితో సతమతం అవుతూ.. ప్రయాణం సాగక పిల్లలు, మహిళలకు చుక్కలు కనిపించాయి. తణుకు బస్టాండులో వందలాది మంది ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సి వచ్చింది. విద్యార్థులు తమ గృహాలకు చేరేందుకు అధిక ధరలు చెల్లించి ఆటోలను ఆశ్రయించారు.





సీఎం సభ నుంచి జనం తిరుగుముఖం

సొమ్ములు పడలేదు



మా పథకాలు గొప్ప.. మేము చాలా చేస్తున్నాం.. బటన్ నొక్కుతున్నాం.. పథకానికి.. పథకానికి.. వేలకోట్లు అని ప్రచారం చేస్తాం. సొమ్ము జమ చేసేది ఎప్పటికో ? సొమ్ము పడితేనే పడినట్టు.. ఎంతమందికి పడతాయో తెలియని పరిస్థితి.. ఇదీ వైసీపీ ప్రభుత్వం పథకాల అమలు తీరు..

- బటన్‌లు నొక్కి నెలలు గడుస్తున్నా.. ఖాతాలు ఖాళీగానే
- ఆసరా, విద్యాదీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ వడ్డీరాయితీల సంగతేంటి ?
- లబ్ధిదారుల ఎదురుచూపు

భీమవరం రూరల్, ఏప్రిల్ 16 : . ఈ ఏడాది ఆరంభం నుంచి సీఎం జగన్ పెద్దపెద్ద ప్రచార సభలు పెట్టి బటన్ నొక్కారు. అలా నొక్కి నాలుగు నెలలు దాటాయి. లబ్ధిదారులు సొమ్ములు ఖాతాల్లో పడలేదు. ఒక పథకం కాదు జగనన్న ఆసరా మొదలుకొని విద్యాదీవెన వ్యవసాయ ఇన్‌పుట్ సబ్సిడీ రుణాల వడ్డీ రాయితీల వరకు అదేతీరు.

పంట నష్టం సొమ్ములు

గడిచిన సార్వా పంటలో మిచౌంగ్ తుఫాన్ దాటికి 50 వేల హెక్టార్‌లలో పంట నష్టపోయింది. జిల్లాలో నష్టపోయిన 31,309 మంది రైతులకు రూ.26 కోట్లు సొమ్ము నష్టపరిహారంగా నాలుగు నెలల క్రితం అందిం చారు. మార్చి నెల 6వ తేదీన సార్ బటన్ నొక్కారు. ఇప్పటికి సొమ్ములు పడలేదు. అది ఉత్తుత్తి బటన్ అనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

ఆసరా సొమ్ములు

అదిగో సొమ్ము ఇదిగో సొమ్ము ఆసరా సొమ్ము ఊరింపులుగా మారింది. లెక్క ప్రకారం 2023 నవంబరులో వేయాల్సిన జగనన్న ఆసరా కాస్త వెనక్కు నెట్టి ఈ ఏడాది జనవరి 23న బటన్ నొక్కారు. 80 రోజులు దాటినా సొమ్ములు పడలేదు. జిల్లాలో 27వేల 4 గ్రూపులకు రూ.275 కోట్లు 90 లక్షల రూపాయిల కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు.

వ్యవసాయ వడ్డీ రాయితీ

వ్యవసాయం రుణాలు చెల్లించడంలో రైతులకు వైసీపీ ప్రభుత్వం హయాంలో భారంగా మారింది. వడ్డీతో సహా రుణం చెల్లించడం తప్ప వడ్డీ రాయితీ అందుకున్న దాఖలాలు లేవు. జగన్ మాత్రం వడ్డీ రాయితీ బటన్ నొక్కుతున్నా అని నొక్కారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మూడు శాతం రాయితీ వస్తుంది తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నాలుగు శాతం వడ్డీ రాయితీ ఐదేళ్ల ఇవ్వలేదు.

రైతుల రాయితీ సొమ్ములు

జిల్లాలో 114 సహకార సంఘాలు ఉండగా సుమారు 2లక్షల మంది రైతులు వ్యవసాయ రుణాలుగా పొందిన దానికి నాలుగు శాతం వడ్డీ రాయితీ కింద రూ.200 కోట్లు వరకు రైతులకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. రాయితీ వస్తుందని సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు రాయితీ రాక నిరుత్సాహంలో పడుతున్నారు.

విద్యాదీవెన సొమ్ములు

విద్యాదీవెన పథకం సంగతి అంతే బటన్ నొక్కి నెలలు గడుస్తున్నా విద్యార్థులకు సంబంధించిన సొమ్ములు పడలేదని అంటున్నారు. జిల్లా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.25 కోట్లు పడాల్సి ఉండగా ఇప్పటికీ రెండు కోట్లు 50 లక్షలు వరకు జమ అయినట్లు సమాచారం. నాలుగు సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ సకాలంలో రాకపోవడం ఇబ్బందిగా మారింది. వేల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు.



భానుశ్రీని అభినందిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

నాడు గ్రూప్-1 టాపర్ నేడు సివిల్స్‌లో మెరిసిన ప్రత్యూష



తల్లిదండ్రులతో గణేశ్న భానుశ్రీ (ఫైల్)

ఏలూరు కలెక్టరేట్/కాళ్ల, ఏప్రిల్ 16 : జాతీయ స్థాయిలో జరిగిన సివిల్స్ పరీక్షల్లో జిల్లాలోని కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన గణేశ్న భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష 198వ ర్యాంక్ సాధించి ఆదర్శంగా నిలిచింది. ఆమె గత ఏడాది గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించి ప్రస్తుతం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. గణేశ్న వెంకట రామాంజనేయులు, ఉషా దంపతులకు ఏకైక సంతానం ప్రత్యూష. ఆమె మొదట నుంచి చదువుపై ఎంతో ఆసక్తి కనబరిచేది. ఉన్నత శిఖరాలు అందుకోవాలనే సంకల్పంతో కష్టపడి చదివి సివిల్స్‌లో ర్యాంక్ సాధించినట్లు తండ్రి రామాంజనేయులు తెలిపారు. ఈ ఏడాది జనవరి 15న ఢిల్లీలో ఇంటర్వ్యూలు జరిగాయి. తల్లి గృహిణి. తండ్రి వెంకట రామాంజనేయులు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ప్రస్తుతం డీఈవో ఆఫీసులో ఏపీవోగా పనిచేస్తున్నారు. మొదటి ప్రయత్నంలోనే సివిల్స్‌లో ఈ ర్యాంకు సాధించారు. ఆమె లక్ష్యం సుస్పష్టం. పట్టుదల, మొక్కవోని ఆత్మ విశ్వాసంతో ప్రణాళికాబద్ధంగా చదివారు. ఈ సందర్భంగా ఆమెను ఏలూరు జిల్లా కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేష్, జేసీ బి.లావణ్యవేణి అభినందించారు. భానుశ్రీ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆమెను ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, డీఆర్వో డి.పుష్పమణితోపాటు సీసలి గ్రామస్తులు అభినందించారు.



బైరాగిమఠం ఆలయంలో విద్యుత్ కాంతులు

నేడు శ్రీరామనవమి

పెంటపాడు మండలం కె.పెంటపాడు బైరాగిమఠం గోపాలస్వామి ఆంజనేయ స్వామి ఆలయం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైంది.





రాములోరి కళ్యాణానికి వేళాయె..

5

శ్రీవారి హుండీ ఆదాయం రూ 1.61 కోట్ల ఆదాయం



ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16: చిన్న తిరుమలేశునికి హుండీల లెక్కింపు ద్వారా గడచిన 17 రోజుల కాలానికి రూ.1.61 కోట్ల రూపా యల భారీ ఆదాయం సమ కూరింది.ప్రమోద కల్యాణ మండప ఆవరణలో మంగళ వారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన రూ.1,61,39,054 నగదుతో పాటు కానుకల రూపేణా 229 గ్రాముల బంగారం, 4.465 కేజీల వెండి లభించి నట్లు ఈవో త్రినాథ రావు తెలిపారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (8), 1000(2), 2000 (19)తో పాటుగా పలుదేశాల కరెన్సీ సైతం లభించింది.

కుంకుళ్లమ్మకు లక్ష గాజులతో అలంకరణ



ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16: క్షేత్రదేవతగా విరా జిల్లుతోన్న కుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండు వగా జరుగుతున్నాయి. లక్ష గాజుల అలం కరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమపూజలు చేశారు. గురువారం వరకూ జరుగనున్న ఉత్స వాల్లో భాగంగా గాజుల అలంకరణలో అమ్మ వారు నిండు ముత్తైదువులా భక్తులకు దర్శన మిస్తు న్నారు. ఈనెల 18న గురువారం ఆలయ ఆవరణలో మహిళలతో కుంకు మపూజ తర్వాత చండీహోమం జరుగు తుందని అర్చకులు భైరవస్వామి తెలిపారు.

వేసవిలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

కలెక్టర్ సుమిత్ కుమార్



భీమవరం టౌన్, ఏప్రిల్ 16 : వేసవిలో తాగునీరు, విద్యుత్తు సమస్యలు ఎదురవకుండా పటిష్టమైన ప్రణా ళికలను రూపొందించి అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. మంగళవారం విజయ వాడ వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసు కోవాలని, కాలువలు కట్టే లోపుగా పూర్తిస్థాయిలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, మంచి నీటి, పశువులు చెరువులు నింపుకోవాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి నివా రణకు నిధులు అందుబాటులో ఉంచామని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్తు కోతలు,లో-వోల్టేజీ సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులు జరిగేచోట కూలీలకు టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నాగేశ్వరరావు,విద్యుత్‌శాఖ సహాయ సంచాలకులు పి.పద్మశ్రీ పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలిస్తున్న జేసీ ఆదిత్య

సెక్టార్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి

జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరంటౌన్, ఏప్రిల్ 16 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ, పోలింగ్ అయ్యిన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలు తరలింపులో భాగంగా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను జిల్లా జాయింటు కలెక్టరు వివరించారు. ఈవీఎంలు, సెంట్రల్ యూనిట్‌లు, బ్యాలెట్ యూనిట్‌లు, వీవీ ప్యాట్ల పంపిణీ, రూటు మ్యాప్ తదితర వాటిపై సెక్టార్ అధికా రులు, ఎంపీడీవోలు, ఉప తహసీల్దార్లకు జేసీ వివరించారు. సెక్టార్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని, పోలింగు ముందు రోజు, పోలింగ్ జరిగిన అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు. ఉండి నియోజక వర్గ నాలుగు మండలాలకు సంబంధించి అసిస్టెంటు రిటర్నింగు, సెక్టారు అధికారులు, ఎంపీడీవోలు, డీటీలు పాల్గొన్నారు.

బంగారం దుకాణంలో ఎన్నికల అధికారుల తనిఖీలు

భీమవరం క్రైం, ఏప్రిల్ 16 : భీమవరం పట్టణంలోని రంగా బజార్‌లో ఉన్న ఒక ప్రముఖ బంగారు దుకాణంలో మంగళవారం ఎన్నికల అధికారులు తనిఖీలు చేశారు. ఎన్నికల సంబంధించి భారీ మొత్తంలో నగదు దుకాణంలో ఉందంటూ సమాచారం అందడంతో దాడులు చేసినట్లు తెలిసింది. ఉదయం నుంచే రెండు బృందాలుగా అధికారులు దాడులు చేశారు. అయితే నగదు ఒక లక్షా 30 వేలు, 500 ఫోటో ఫ్రేములు దొరకడంతో వాటిపై ఆరా తీస్తున్నారు. సరైన బిల్లులు చూపిం చాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ దుకాణంలో నగదు మార్పిడి ఏమైనా జరిగిందా ? మరేదైనా కారణమా అన్నది తెలియాల్సి ఉంది.



పునుకొల్లు సమీపంలో కృష్ణా కాలువ గట్టుపై చెట్లకు నిప్పు పెట్టిన దృశ్యం

కృష్ణా కాలువ వెంబడి చెట్లకు నిప్పు

పెదపాడు, ఏప్రిల్ 16 : కొందరి ఆకతాయిల చేష్టలకు, కొందరి స్వార్థ ప్రయో జనాలకు పెట్టిన నిప్పుతో కృష్ణా కాలువ వెంబడి ఇరువైపులా గట్టుకు రక్షణగా వున్న పచ్చటి చెట్లు కాస్త అగ్ని ఆహుతవుతున్నాయి. వేసవి వచ్చిందంటే చాలు ఇటువంటి దుశ్చర్యలు ప్రతి ఏటా జరుగుతూనే వున్నాయి. కొంతమంది కాలువ గట్టుపై చెట్లు, తుప్పలకు నిప్పు పెట్టి కాలిపోయిన ప్రాంతంలోని కాలువ గట్టు మట్టిని రాత్రుళ్ల దొంగచాటుగా తవ్వి తీసుకెళ్లిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా అటు చెట్లకు, ఇటు కాలువ గట్టుకు నష్టం చేకూరేలా జరుగుతున్న చర్యలపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖాధికారులు దృష్టి సారించడంతో పాటుగా నిఘా పెట్టి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

16-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	246	225	237.14
జంగారెడ్డిగూడెం-1	249	235	243.13
జంగారెడ్డిగూడెం-2	249	235	242.66
కొయ్యలగూడెం	249	235	242.91
గోపాలపురం	249	235	242.27

రాములోరి కల్యాణానికి వేళాయె..



తూర్పు యడవల్లి రామాలయానికి విద్యుద్దీపాలంకరణ

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 16: రాములోరి కల్యాణానికి వేళయింది. సీతా రాముల కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో చలువ పందిళ్ళు వేశారు. దేవాలయాలను రంగులతో ముస్తాబు చేశారు. విద్యుద్దీపాల వెలుగులతో రామాలయాలు కాంతులీను తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధ ఆలయాలైన చిన భద్రాద్రిగా పేరొందిన కామవరపు కోట మండలం ఈస్టు యడవల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయం, జంగారెడ్డిగూడెం సమీపంలోని గురవాయిగూడెం వద్ద మద్ది ఆంజనేయ స్వామి ఆలయం, పెంటపాడు మండలం బైరాగిమఠం ఆలయం, చాట్రాయిలోని అపరభద్రాద్రిలో కలాణోత్సవాలకు శ్రీరామనవమి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరామనవమి వేడుకలను కొన్ని ప్రాంతాల్లో మూడు రోజుల పాటు, కొన్ని ప్రాంతాల్లో ఐదు రోజులు, కొన్ని ప్రాంతాల్లో 9రోజులపాటు నిర్వహించాలని ఉత్సవ కమిటీలు నిర్ణయించాయి.



బైరాగి మఠం ఆలయం వద్ద చలువ పందిళ్లు

ముస్తాబైన బైరాగిమఠం గోపాలస్వామి

పెంటపాడు, ఏప్రిల్ 16 : శ్రీరామనవమి వేడుకలను పెంటపాడు మండ లంలోని కే.పెంటపాడు బైరాగిమఠం గోపాలస్వామి ఆలయం ముస్తాబైంది. స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఫిట్‌పర్సన్ రవిశంకర్ తెలిపారు. ఆలయం బయట, లోపలు చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. 17వ తేదీ బుధవారం సీతారామకళ్యాణ మహోత్సం జరగనుంది. కల్యాణం అనంతరం సుమారు 10 వేల మందికి పైగా భారీ అన్నసమారాధన చేయనున్నారు. అదే రోజు రాత్రి స్వామివారికి గ్రామోత్సవం జరపనున్నారు. 18వ తేదీ గురు వారం స్వామి రథోత్సవాన్ని అత్యంత ఘనంగా జరుపుతారు. 19వతేదీ శుక్ర వారం ఆలయ సమీపంలోని కోనేరు వద్ద స్వామివారికి తెప్పోత్సవం నిర్వహిస్తారు. తెప్పోత్సవం జరిగే సమయంలో భారీ బాణసంచా కాల్చు తారు.బాణసంచా కాల్పులు వీక్షించేందుకు గ్రామం నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా అధికసంఖ్యలో ప్రజలు వస్తుంటారు. 20వ తేదీ శని వారం చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముఖ్య అతిథులకు పూర్ణకుంభ స్వాగతం, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణం వద్ద అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.



తూర్పు యడవల్లిలో విద్యుత్ దీపాల కాంతుల్లో పర్ణశాల

18న చినభద్రాద్రిలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16: చినభద్రాద్రిగా పేరొందిన తూర్పు యడవల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం రాములోరి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. చినవెంకన్న ఆలయానికి దత్తత ఆలయం కావడంతో స్వామి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు. ఉదయం 10-30 గంటలకు స్వామివారి కల్యాణం ప్రారంభిస్తామని తెలిపారు. 2003లో శ్రీవారి దేవస్థానం దత్తత తీసుకుని అన్ని కైంకర్యాలను, ఉత్సవాలను నిర్వహిస్తూ అభివృద్ధి చేస్తున్నారు. గురు వారం ఉదయం 10 గంటలకు శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహి స్తామని ఈవో వివరించారు. ద్వారకా తిరుమలలో శ్రీవారి కల్యా ణంతో పాటు రాములోరి కల్యాణాన్ని బుధవారం ఉదయం నిత్యకల్యాణ మండప ఆవరణలో నిర్వహించను న్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఉభయ దేవేరులతో స్వామివారు బుధవారం ఉదయం, సాయంత్రం తిరువీధుల్లో విహరిస్తారు. క్షేత్రంలో పలు ప్రాంతాల్లో రామాలయాలను, విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు.



ద్వారకా తిరుమలలో ఏర్పాట్లు



ఆకట్టుకున్న ఎదుర్కోలు ఉత్సవం

చాట్రాయి, ఏప్రిల్ 16: అపర భద్రాద్రిగా పేరొందిన చాట్రాయి మండలం చనుబండ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎదు ర్కోలు ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశ వరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జనక మహారాజు తరపున పెళ్ళి పెద్దలు, దశరథ మహారాజు తరపు పెళ్ళి పెద్దలు, సీతాదేవిని రాములవారిని తీసు కొని మంగళ వాయిద్యాలతో బయలుదేరి ఆర్యవైశ్య ప్రముఖుడు జల్లేపల్లి మురళీకృష్ణ ఇంటికి చేరుకొని సమావేశమయ్యారు.దశరథ మహారాజు తరపు పెద్దలు 'మా రామయ్య పురుషోత్తముడు, సుగుణాల సంపన్నుడు, సత్య వాక్కు పరిపాలకుడు.. అంత గొప్పవాడిని అల్లుడిగా పొందటం మీ అదృష్టం' అనగా, మా సీతమ్మ అందాలరాశి, సాక్షాత్ లక్ష్మీదేవి' అంటూ సీతారాముల గొప్పతనాన్ని చెప్పుకొచ్చారు. అనంతరం పెళ్ళి సంబంధం ఖాయం చేసుకొని లగ్నపత్రికలు మార్చుకున్నారు. ఈ మధుర ఘట్టాలను గ్రామస్థులు భక్తిభా వంతో తిలకించారు.



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

సమావేశానికి రాలేదని వైసీపీ నాయకుల దాడి

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

చింతలపూడి, ఏప్రిల్ 16 : తెలుగుదేశం సానుభూతిపరుడు ఇంటిపై గత రాత్రి వైసీపీకి చెందిన కొందరు దాడి చేసి ఇంటి గోడను పలుగుతో పగలకొట్టి ఆ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీ బీసీ కాలనీలో ఉంటున్న కొనకళ్ల చిన్నారావు వద్దకు కొందరు వచ్చి "ఈనెల 14న వైసీపీ గౌడ కుల ఆత్మీయ సమావేశం జరుగు తుంది.." రావాలని కోరారు. కుదరకపోవడంతో చిన్నారావు సమావేశానికి వెళ్లలేదు. ఇది మనసులో పెట్టుకుని ఈనెల 15వ తేదీ రాత్రి చిన్నారావు ఇంటికి ముగ్గురు వ్యక్తులు వెళ్లి ప్రహరీ గోడపై వివాదం పెట్టుకుని గోడను పలుగుతో కూల్చారు. ఈ సంఘటనతో కుటుంబం ఆందోళనకు గురైంది.దీనిపై చిన్నారావు భార్య స్వప్న తన భర్త లేని సమయంలో ఇంటికి చింతన యేసు, బాలిన చందు, బాలిన చరణ్ అనే ముగ్గురు వ్యక్తులు వచ్చి బూతులు తిడుతూ తమ ఇంటి గోడను పగలకొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై మంగ ళవారం కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు నానాటికీ పెరుగుతున్నాయని, ఓటమి భయంతో అభద్రతా భావం చోటు చేసుకుని ఈ విధంగా దాడులకు పాల్పడుతున్నారన్నారు. చిన్నారావు కుటుం బానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నూజివీడు టౌన్, ఏప్రిల్ 16: కృష్ణా జిల్లా అండర్-18 జూనియర్ బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి ఎంపికలు నూజివీడు బెతస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకు 80 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారని కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అ సోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు నూజివీడు బీఐఎస్ సీబీఎస్ఈ స్కూల్‌లో జరిగే 9వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవ్యా తదితరులు పాల్గొన్నారు.

రేపు కాపు ఆత్మీయ సమావేశం

కైకలూరు, ఏప్రిల్ 16: కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఈ నెల 18న కాపు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ తెలిపారు. కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో నిర్వహించే సమావేశానికి వంగవీటి రాధా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. 18వ తేదీ మధ్యాహ్నం ముదినేపల్లి మండలం బొమ్మి నంపాడు గ్రామం నుంచి రాధాతో కలసి బైక్ ర్యాలీ ఉంటుందన్నారు.



ఉండి మండలం ఉప్పులూరులో మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి విగ్రహ ప్రారంభోత్సవంలో ఆయన కుటుంబ సభ్యులు

విలువలు కలిగిన నేత యర్రా నారాయణస్వామి

ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు

ఉండి, ఏప్రిల్ 16: మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి విలువలు కలిగిన నాయకుడు, అజాత శత్రువు అని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం ఉప్పులూరులోని యర్రా వ్యవసాయ క్షేత్రంలో ఆయన విగ్రహాన్ని యర్రా కుటుంబసభ్యులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాతగా, విద్యాదాతగా నారా యణస్వామి చిరకాలం గుర్తుంటారన్నారు. కార్యక్రమంలో నారాయణస్వామి కుమారులు సూర్యచంద్రరావు, శ్రీనివాస్ నవీన్‌లతో పాటు కుటుంబసభ్యులు, తాడేపల్లిగూడెం, తణుకు మాజీ ఎమ్మెల్యేలు పసల కనకసుందరరావు, ముళ్లపూడి వెంకటకృష్ణారావు, తాడేపల్లిగుడెం టీడీపీ ఇన్‌చార్జు వలవల బాబ్జి, చలసాని శ్రీనివాస్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, బెల్లంకొండ బుచ్చిబాబు తదితరుల పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న కళాకారుల సంఘ ప్రతినిధులు

ఘనంగా తెలుగు నాటక రంగ దినోత్సవం

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 16: రంగస్థల కళాకారులకు తెలుగు నాటకరంగ దినోత్సవం ఒక పండుగ లాంటిదని హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ అన్నారు. ఏలూరు వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో మంగళవారం రాత్రి కందుకూరి వీరేశలింగం జయంతి పురస్కరించుకుని కళాకారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కళా సమ్మేళనం వైభవంగా జరిగింది. తొలుత జాహ్నవి లాలిత్య బృందం కూచిపూడి నృత్యం అలరించింది. అనంతరం పౌరాణిక నటులు కె.విజయ్‌భాస్కర్, దొంతేపల్లి అప్పారావులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఏలూరు గుత్తా ఫౌండేషన్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో కళారంగానికి విశిష్టసేవలు అందించి ఆర్థికంగా వెనుకబడిన కళాకారులు కల్యాణ్, చంద్రమౌళి, ఎస్.సత్యనారాయణ, సీబీ కల్యాణిలకు ఆర్థిక సత్కారం అందించారు. కేవీ సత్యనారాయణ, వై.సోమ లింగేశ్వరరావు, లంకా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, పైడి బీమేశ్వరరావు, పురు షోత్తం, కె.సుబ్బారావు, ఖాజావలీ, గుత్తా ఫౌండేషన్ ప్రతినిధి పట్టాబి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సత్యహరిశ్చంద్ర నాటకంలో వారణాసి సీను ప్రేక్షకులను రంజింప చేసింది.

మే 11న జాతీయ లోక్ అదాలత్



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టులలో మే 11న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహి స్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఎ భవనంలో కార్యదర్శి రత్నప్రసాద్ విలేకరుల సమావేశంలో మంగళ వారం మాట్లాడారు. 2024 సంవత్సరంలో నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించాల్సి ఉండగా మే 11న రెండో జాతీయ లోక్ అదాలత్ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. గతంలో జిల్లాలో జరి గిన మొదటి లోక్ అదాలత్‌లో 1760 రాజీ పడిన కేసులు పరిష్కరించమన్నారు. జిల్లాలో 10 మండల న్యాయ సేవాధికార సంస్థలోనూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏలూరుతో కలిసి 11 చోట్ల ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. రాజీ కేసులకు సంబంధించి సందేహాలు ఉంటే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. అవసరమైతే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి కేసును రాజీ చేస్తామన్నారు. ఎవరైనా న్యాయ సహాయం కావాలనుకుంటే 08812-224555 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కలిదిండి మండలంలో అడుగంటిన పోలరాజ్ కెనాల్

తాగునీటి గండం!

అడుగంటిన పోలరాజ్ కెనాల్...శివారు గ్రామాలకు అందని నీరు

కలిదిండి, ఏప్రిల్ 16 : కలిదిండి మండలంలో పోలరాజ్ కెనాల్‌కు అర కొరగా తాగునీరు విడుదల చేయడంతో అడుగంటింది. సుమారు 400 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా, 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఇంతవరకు పోలరాజ్ కెనాల్‌కు తాగునీరు సరఫరా కాలేదు. దీంతో తాగునీటి చెరువులను ఏ విధంగా నింపుకోవాలని సర్పం చ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తాగునీటి ఎద్దడి తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుతెగలపాడు, కాళ్లపాలెం, కొండూరు, తాడినాడ, చినతాడినాడ గ్రామాల్లో తాగునీటి చెరు వులను నింపుకోవడానికి తాగునీటి వంతు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 10న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ కలిదిండి సందర్శించి ఆరుతెగలపాడు వద్ద అడుగంటిన పోలరాజ్ కెనాల్‌ను పరిశీలించారు. పోలరాజ్‌కు సమృద్ధిగా తాగునీరు విడుదల చేసి ఆయా గ్రామాల్లో అడుగంటిన చెరు వులను నింపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినా ఇంత వరకు అరకొరగా సరఫరా చేయడంతో శివారు గ్రామాలకు నీరు చేరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధి కారులు స్పందించి సమృద్ధిగా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

గడ్డి మంటల్లో యువకుడి మృతి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగబాబు

ఆకివీడు రూరల్, ఏప్రిల్ 16 : ఆకివీడు మండలం పెద కాపవరం శివారులో గడ్డిమేటు మంటల్లో యువకుడు మృతి చెందాడు.నిడమర్రు మండలం బావాయి పాలెనికి చెందిన గొర్రెల దుర్గారావు (28) పెట్రోల్ పోసు కుని అంటించుకుని గడ్డివాములోకి వెళ్లాడని దీంతో అగ్నికి ఆహుతై మృతి చెందినట్లుగా పోలీ సులు తెలిపారు. మృతుడు కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడతు న్నట్లుగా తెలియవచ్చింది. ఎస్ఐ నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

కలుపు మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

పోలవరం, ఏప్రిల్ 16 : కలుపు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పోలవరం మండలం ప్రగడపల్లి పంచాయతీ రేపల్లె వాడలో మంగళవారం జరిగింది. రేపల్లెవాడ గ్రామానికి చెందిన కాపా పోశిరావు కలుపు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో బంధువులు అతడిని పోలవరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స అనం తరం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఆత్మహత్యా యత్నానికి కారణాలు తెలియవలసి ఉందని పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీకి గాయాలు

పోలవరం, ఏప్రిల్ 16 : పోలవరం మండలం జిల్లెల్లగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి విద్యుత్ షాక్‌కి గురై వ్యవసాయ కూలీ గాయపడ్డాడు. జిల్లెల్లగూడెం గ్రామానికి చెందిన శివరామకృష్ణారెడ్డి తన పొలంలో పని చేసుకుంటుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడని చికిత్స నిమిత్తం పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించి అక్కడి నుంచి మెరు గైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించినట్లు పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహానికి పోస్టుమార్టం

పోలవరం, ఏప్రిల్ 16 : పోలవరం మండలం గూటాల పంచాయతీ కొండ్రుపీది గోదావరి నది రేవులో నాలుగు రోజుల క్రితం లభ్యమైన మృత దేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. మృతుని వివరాలు తెలియవలసి ఉందని తెలిసిన వారు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు శిక్ష

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 : ఒక యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై నేరం రుజువు కావడంతో పది సంవత్సరాలు జైలు శిక్ష, రెండు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదవ అదనపు సెషన్స్ జడ్జి, మహిళా కోర్టు జిల్లా న్యాయాధికారి రాజేశ్వరి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021 ఆగస్టు 20 తెల్లవారు జామున పెదపాడు మండలం పాతముప్పర్రులో నివాసం ఉంటున్న అమ్మమ్మ తాతయ్యలు ఆసుపత్రి నిమిత్తం విజయవాడ వెళ్లగా ఆ ఇంట్లో వారి మను మరాలు ఒక్కతే ఉంది. అదే రోజు ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై పాతముప్పర్రు గ్రామానికి చెందిన సాకా శివ (25) అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పెదపాడు పోలీసులకు ఫిర్యాదు అందడంతో అప్పటి పెదపాడు ఎస్ఐ జ్యోతిబస్సు కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ సీఐ అనసూరి శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రెండు వేలు జరిమానా విధిస్తూ జడ్జి రాజేశ్వరి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామాంజ నేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు పెదవేగి సీఐ శ్రీనివాసకుమార్, పెదపాడు ఎస్ఐ శుభశేఖర్, కోర్టు కానిస్టేబుల్ పవన్ కుమార్‌లు సహకరించారు. సకాలంలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి ప్రాసి క్యూషన్‌కు సహకరించిన పెదవేగి సీఐ, పెదపాడు ఎస్ఐ, కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రశాంతి అభినందించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా



కాంబోట్లపాలెంలో ప్రచారం చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు

యలమంచిలి, ఏప్రిల్ 16: నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పని చేస్తానని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. కాంబోట్లపాలెం గ్రామంలో మంగళవారం పార్టీల శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అరాచక పాలనతో రాష్ట్రం అధోగతి పాలయ్యిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం పరితపించే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెచ్చెట్టి బాబు, బోనం చినబాబు, ఉన్నమట్ల కబర్ధి, చిట్టూరి రామాంజనేయులు, అప్పారి వీరాంజనేయులు వాసంశెట్టి కేశవరావు, అనిశెట్టి ప్రసాద్, బోనం నాని ఆరిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తీరం అభివృద్ధి ఎన్డీఏతోనే సాధ్యం



నరసాపురంలో ప్రచారం చేస్తున్న ఎన్డీఏ కూటమి నాయకులు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 16: తీర ప్రాంత అభివృద్ధి ఎన్డీఏతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, టీడీపీ, బీజేపీల కన్వీనర్లు పొత్తూరి రామరాజు, మేకల సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని పీఎంలంక గ్రామంలో జనసేన అభ్యర్థి నాయకర్, ఎంపీ అభ్యర్థి వర్మల గెలుపు కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అధికారంలోకి రాగానే బియ్యపుతిప్ప హార్బర్‌ను పూర్తి చేసి, నల్లిక్రిక్ తవ్వకం పనులు చేపడతామన్నారు. ధర్బరేవు, ఈస్ట్‌కుక్కులేరు స్లూయిస్ రిపేర్లను పూర్తి చేస్తామన్నారు. తీర ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించి, ఇంటింటికి కుళాయి అందిస్తామన్నారు.

ఎన్డీఏ కూటమిదే అధికారం..

భీమవరం అర్బన్, ఏప్రిల్ 16: భీమవరం పట్టణంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు టీడీపీ సీనియర్ నాయకులు మెంటే గోపి, ఎద్దు ఏసుపాదం బాతు నరేష్ సమక్షంలో భీమవరం 2వ పట్టణ నుంచి గెడ్డం నరసింహులు 60 మంది అనుచరులు టీడీపీలో చేరారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి టీడీపీ కండువ వేసి ఆహ్వానించారు. కోడికత్తి, రాయి డ్రామాలతో ప్రజల సానుభూతి పొంది ఎన్నికలలో గెలుపొందాలని చూస్తున్న జగన్ ఎత్తుగడలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. అన్ని రంగాలలో విఫలమైన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపి ఎన్డీఏ కూటమికి అధికారం ఇవ్వనున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ మెంటే గోపి, వార్డు కమిటీ సభ్యులు చల్లబోయిన సుబ్బారావు, గోవింద్, బొక్కా సూరిబాబు, పాల శ్రీరామదాసు, జంపన ధనరాజ్, మల్లువలస రాము, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

'వైసీపీతో తీవ్రంగా నష్టపోయిన బీసీలు'

పెంటపాడు, ఏప్రిల్ 16: వైసీపీ విధానాలతో బీసీలు తీవ్రంగా నష్టపోయారని నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. మంగళవారం పెంటపాడులో బీసీ ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం అభివృద్ధిలో నడవాలంటే కూటమిని గెలిపించాలని కోరారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

జట్లపాలెం ఉప సర్పంచ్ టీడీపీలో చేరిక

జట్లపాలెం ఉప సర్పంచ్ చెరుకు సూర్యనారాయణ (హనుమంతు)తో సహా పలువురు బాబ్జి సమక్షంలో టీడీపీలో చేరగా వారికి టీడీపీ కన్వీనర్ బాబ్జి కండువా కప్పి వారిని పార్టీ లోకి ఆహ్వానించారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, గంధం సతీష్, పాశం బులివెంకట రమణారావు, కుదుళ్ళ చంద్రశేఖర్, వల్లేపల్లి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటా: బొలిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 16: ఆటో డ్రైవర్లందరికీ అండగా ఉంటానని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ డ్రైవర్ కుటుంబం నుంచి వచ్చిన తనకు డ్రైవింగ్ ఫీల్డ్‌లో ఉండే ఇబ్బందులు తెలుసునన్నారు. అనంతరం జనసేనలో ఆటో డ్రైవర్లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తాడేపల్లిగూడెం రూరల్: జగన్ నాటకాలను ప్రజలు నమ్మరని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మారంపల్లిలో సోమవారం రాత్రి జరిగిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు కోడి కత్తి, బాబాయ్ హత్య నాటకాలు తెరమీదకు తెచ్చి ప్రజల సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన జగన్ మళ్లీ అవే అస్త్రాలు వాడుతున్నాడని, జగన్ కుయుక్తులు ప్రజలకు అర్థమయ్యాయన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే రామరాజు



గుమ్ములూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు రూరల్, ఏప్రిల్ 16 : నియోజకవర్గంలో చాలా గ్రామాలలో డ్రెయినేజీ, మంచినీటి సమస్య అధికంగా ఉందని రాబోయే ప్రభుత్వంలో ఖచ్చితంగా సమస్యల పరిష్కారం చేసే దిశగా ముందుకు వెళ్తామని ఉండి ఎమ్మెల్యే రామరాజు అన్నారు. మంగళవారం నాడు గుమ్ములూరులో బాబూ షూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ 22వ తేదీన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు.

జగన్ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలి



గూట్లపాడు ఆత్మీయ సదస్సులో పాల్గొన్న ఉమ్మడి నాయకులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 16: అవినీతి.. అక్రమాలు దోపిడీ, దౌర్జన్యాలు చేసిన జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని నరసాపురం లోక్‌సభ బీజేపీ కూటమి అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాస వర్మ, భీమవరం అసెంబ్లీ జనసేన పార్టీ కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజి బాబు) ఓటర్లకు పిలుపునిచ్చారు. గూట్లపాడు గ్రామంలో సోమవారం రాత్రి జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలు నీతి,అవినీతికి, ధర్మం,అధర్మానికి మధ్యజరగబోతు న్నాయని అన్నారు. జిల్లాటీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లాఅధ్యక్షుడు కొటికలపూడి గోవిదరావు(చినబాబు) పాల్గొన్నారు.

అంజిబాబుకు ఎల్ఐసీ యూనియన్ మద్దతు

భీమవరం టౌన్, ఏప్రిల్ 16: ఎల్ఐసీ, ఎల్ఐఏఎఫ్ఐ యూనియన్ సభ్యులు మంగళవారం జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను కలిసి మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు కొప్పర్తి త్రిమూర్తులు, అధ్యక్షుడు అముదాల సత్యనారయణ, సెక్రటరి పాల శ్రీనివాస్, ట్రెజరర్ జి. శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు లక్ష్మీపతి రాజు, రాంబాబు, ఎన్.శ్రీనివాస్ రావు, కే రామకృష్ణ, అన్నపూర్ణ, కే మోహన్ లక్ష్మి, శేషగిరి పాల్గొన్నారు.

నేడు శ్రీరామ నవమి

ముస్తాబైన రామాలయాలు



పాలకొల్లు బుధవారపువీధిలో రామాలయం

ఆచంట, ఏప్రిల్ 16: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలో రామాలయాలను చలువ పందిర్లు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఇప్పటికే పెద్ద ఎత్తున కమిటి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దీంతో రామాలయాలు వద్ద నవమి సందడి నెలకొంది.

పాలకొల్లు అర్బన్: శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్ఆర్‌పేట, రైలు గేటు వద్ద, దేశాలమ్మ గుడివద్ద, కొత్తపేట, రామారావు పేట, రంగమన్నారుపేట, బ్రాడీపేట, శ్రీరామ్‌పేట, ముత్యాల వారి వీధి, కంచర్లవారి వీధి, బుధవారపు వీధి, కరణాల వారి వీధి, బొండాడ వారి వీధి, మఠం వీధి తదితర ప్రాంతాల్లో రాముని కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్ల వేశారు.



కొడమంచిలిలో రామాలయం వద్ద చలువ పందిరి వేసిన దృశ్యం

పాఠశాలలో నవమి వేడుకలు

అత్తిలి, ఏప్రిల్ 16 : బల్లిపాడు మదన గోపాల్ స్కూల్లో శ్రీ రామనవమి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ తిరుపతి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరాముని జీవనం ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ సిబ్బంది లక్ష్యాలు పూర్తి చేయాలి: డీఎంహెచ్‌వో



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లీనా సుప్రియ

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 16 : వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది తమకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డి మహేశ్వర రావు అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోనిపై పూలపల్లి సచివాలయంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వరరావు విచ్చేసి మాట్లాడారు. ఓపీ కార్డుల్లో బీపీ, షుగరు పేషంట్లు, ఇతర వ్యాధి గ్రస్తులు వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. ప్రమాదకర లక్షణాలు కనిపించిన గర్భిణులను తరచుగా ఆశా, ఏఎన్ఎంలు పర్యవేక్షించాలని సూచించారు. అటువంటి వారిని ప్రసవ సమయంలో ఏరియా ఆసుపత్రులకు తీసుకువెళ్ళి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలని అన్నారు. ఆడపిల్లల రేషియో పెంచడానికి ప్రతీ సచివాలయం పరిధిలో భేటీ బచావో, భేటి పడావో కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ సెంటర్‌లోనూ, పాఠశాలల్లోనూ విద్యార్థినీలు, గర్భిణులకు, బాలింతలకు ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లీనా సుప్రియ, డాక్టర్ కిషోర్, డాక్టర్ జయదుర్గాదేవి, విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎంఆర్‌కె రాజు, కార్యదర్శి లింగం సత్యనారాయణ, ఆశాలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై డెమో ప్రదర్శన



నరసాపురంలో డెమో చేస్తున్న ఫైర్ సిబ్బంది

నరసాపురం, ఏప్రిల్ 16: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఫైర్ సిబ్బంది ప్రమాదాల నివారణపై డెమో చేశారు. ఇంట్లో సిలిండర్ లీకైనప్పుడు ఏ విధంగా మంటలను అదుపు చేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. సిలిండర్ సాయంతో పెద్ద మంట వెలిగించి దాన్ని ఆర్పే విధానంపై డెమో చేశారు. రాత్రి సమయాల్లో సిలిండర్లను కట్టివేస్తే ప్రమాదాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారి భాస్కర్‌రాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు: అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఆస్థి-ప్రాణ నష్టం సంభవించకుండా మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించిననంతరం అగ్నిమాపకశాఖకు సరైన సమాచారం తెలియచేయాలని అగ్నిమాపకశాఖాధికారి నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం విభవ్ భవనం (అపార్టమెంట్స్)లో అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పించి మాట్లాడారు. వంటింట్లో గ్యాస్ ఉన్నప్పుడు వేరొక సిలిండర్ ఉంచకూడదని, గ్యాస్ లీకైతే ముందుగా ఏమిచేయాలో మహిళలకు వివరించారు.

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బ్రాడీపేట బైపాస్‌రోడ్డులోని స్వప్న అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ బండ నుంచి గ్యాస్ లీకైనసమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రదర్శనగా చూపించి, అవగాహన కలిగించారు. ముందుగా ఫైర్ కార్‌తో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వైవీ జానకిరామ్, లీడింగ్ ఫైర్‌మెన్, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో అపార్టుమెంట్ ప్రెసిడెంట్ ఆర్. సత్యనారాయణ రాజు, కార్యదర్శి ఎస్.శివ, అపార్టుమెంట్‌లోని మహిళలు, ఆప్రాంత నివాసులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో అగ్నిమాపక వారోత్సవాలు మూడోరోజు మంగళవారం కొనసాగాయి. పట్టణంలోని భూపాల ఎన్‌క్లేవ్‌లో గృహిణులకు వంట గ్యాస్‌కు సంబంధించిన అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక అధికారి రామారావు వివరించారు.

బ్రాహ్మణుల సంతాపం



ఆకివీడు, ఏప్రిల్ 16: బ్రాహ్మణ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు అమ్మనమంచి శ్రీరామచంద్రమూర్తి భార్య సుబ్బలక్ష్మి (76) సోమవారం రాత్రి మరణించారు. బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం పలువురు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

రామాయణంపై విద్యార్థులకు పోటీ పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఆకివీడు, ఏప్రిల్ 16: దేశానికే ఆదర్శం శ్రీరామచంద్ర మూర్తి అని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గొంట్లా గణపతి అన్నారు. శ్రీరామ నవమి పురస్కరించుకొని మంగళవారం ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో శ్రీమద్రామాయనం అనే అంశంపై 8,9,10 తరగతుల విద్యార్థులకు అబ్జెక్టివ్ టైప్ పోటీ పరీక్ష నిర్వహించి అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కార్యద ర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి గుర్రం ఈశ్వరరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు బొండాడ రాధాకృష్ణ, వనితా క్లబ్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, గీతా మహిళా మండలి అధ్యక్షురాలు రాజ్యం, చొప్పెర్ల బలరామ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకారం: ఆర్వో



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో రమణ

తణుకు, ఏప్రిల్ 16: సాధారణ ఎన్నికలకు ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రిటర్నింగ్ అధికారి బీవీ రమణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18 నుంచి 25 వరకు సెలవు దినాలు మినహాయించి ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 26న స్క్రూటినీ, 29న ఉపసంహరణ ఉంటుందన్నారు. నామినేషన్లు వేసే వారితో పాటు మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతి ఇస్తామన్నారు. కార్యాలయంలోకి మీడియాకు అనుమతి లేదని, అవసరమైన ఫొటోలు, వీడియోలు ఇస్తామన్నారు. పార్టీలకు గుర్తుల కేటాయింపు తెలుగు అక్షర క్రమంలో ఉంటుందన్నారు. ఎన్నికల సామగ్రి వచ్చే నెల 12న తణుకు బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణం నుంచి పంపిణీ చేస్తామన్నారు. ఏఆర్వో ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ 18 నుంచి ప్రారంభమవుతుందని ఆర్వో కె. చెన్నయ్య తెలిపారు. తాడేపల్లిగూడెంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ నామినేషన్ పత్రాలు ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్ద అందుబాటులో ఉంటాయని ఏమైనా సందేహాలుంటే సిబ్బందిని అడగవచ్చన్నారు. నియోజకవర్గంలో చిలంకంపాడు, నందమూరు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఏఆర్వో, తహసీల్దార్ మురళీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి : సీపీఎం

గణపవరం, ఏప్రిల్ 16: ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి సీపీఎం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం పిప్పరలో జరిగింది. లింగరాజు మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమికి, లౌకికవాద ఇండియా కూటమికి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వైసీపీ పరోక్షంగా బీజేపీకి సహకరిస్తున్న దుస్థితి ఈ రాష్ట్రంలో ఉందని విమర్శించారు. ఏలూరు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను, ఉంగు టూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాతపాటి హరికుమార్ రాజును గెలిపించాలని కార్యకర్తలను కోరారు.

అమ్మవారికి పూల అలంకరణ



భీమవరం టౌన్, ఏప్రిల్ 16 : మెంటేవారితోటలో శ్రీ విజయ కనకదుర్గ శ్రీ చక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి సందర్భంగా 8వ రోజు పునస్కరించుకొని కనకాంబరాలు, మల్లెలతో ప్రత్యేక అలంకారం చేశారు. కాళ్ళకూరి సుబ్రహ్మణ్యం దంపతుల సౌజన్యంతో పూలతో అలంకారం చేశారు.

పెద్దమొత్తంలో నగదు తరలించరాదు



ఆచంటలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆచంట, ఏప్రిల్ 16: ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో సీజర్, ఎస్‌పోర్ మేనేజ్‌మెంటు అనుమతులు సి విజిల్ కార్యకలాపాలుపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామి నాయుడు అన్నారు. మంగళవారం ఎన్నికల కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో సీజర్ చేసుకున్నవాటి వివరాలు తెలియజేస్తూ ఏ ఒక్కరు కూడా నగదు రూపంలో రూ.50 వేలు మించి దగ్గర ఉంచుకోరాదని ఒక పెద్ద మొత్తంలో నగదు ఉంటే తగిన ఆధారాలు తనిఖీలు నిర్వహించే అధికారులకు చూపించాలన్నారు. సింగిల్‌విండోవిధానంలో సువిధ లో వస్తున్న దరఖాస్తులను పరిశీలించి మార్గదర్శకలు మేరకు అనుమతులు జారీ చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రజలు సహకరించాలన్నారు. ఎటువంటి సమాచారానికైనా కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేసిన 08814297299 కు సంప్రదించాలన్నారు. అలాగే స్థానిక కార్యాలయంలో కంట్రోల్ యూనిట్ వీవీ ప్యాడ్స్ ఈవీఎంలపై అధికారులు అవగాహన కల్పించారు.

శిరోముండనంపై తీర్పు చరిత్రాత్మకం

తణుకు, ఏప్రిల్ 16: శిరోముండనం కేసులో న్యాయస్థానం తీర్పు దళితుల ఆత్మగౌరవం మరింత పెరిగేలా చేసిందని దళిత ఉద్యమ నేత లాజర్ అబ్బ దాసరి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 1996లో ఐదుగురు దళితులను హింసించి శిరోముండనం చేసిన కేసులో బాధితులు నిలబడి న్యాయస్థానంపై నమ్మకం కలిగించారని అన్నారు.

ఆచంట: శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు విశాఖ కోర్టు జైలు శిక్ష విధించడం దళితుల ఆత్మగౌరవం బలపడిందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో దళితులను శిరోముండనం కేసు 28 సంవత్సరాలు తరువాత తీర్పు రావడం దళితుల ఆత్మగౌరవం మరింత పెరిగేలా చేసిందని పుష్పరాజు అన్నారు.

పాలకొల్లు రూరల్: దళిత యువకుడి శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు శిక్ష పడటం పట్ల దళిత సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోటి రాంబాబు కార్యాలయంలో నియోజకవర్గ దళిత సంఘాల నాయకులు విలేకర్లతో మాట్లాడారు. 28 ఏళ్ళ అనంతరం దళితజాతికి జరిగిన అవమానానికి నిందితుడికి శిక్ష పడటం హర్షణీయమన్నారు. జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పీతల శ్రీనివాస్, నియోజక వర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండేటి జీవరత్నం, ఎల్లమిల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

19న పితాని, రంగనాధరాజు నామినేషన్

ఆచంట, ఏప్రిల్ 16ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ, వైసీపీ అభ్యర్థి శ్రీరంగనాథరాజు ఈనెల 19న నామినేషన్ వేస్తున్నారు. పితాని తమ స్వగ్రామం అయిన కొమ్ముచిక్కాలలో ఉదయం 7.30 గంటలకు ర్యాలీగా బయలుదేరి మార్టేరు వస్తారు. అక్కడి నుంచి ఆచంట చేరుకుంటారు. అలాగే చెరుకువాడ శ్రీరంగనాధరాజు తూర్పుపాలెంలోని క్యాంప్ కార్యాలయం నుంచి ఉదయం 9.30 గంటలకు పాదయాత్రగా ఆచంట చేరుకుంటారు. ఈ నెల 19న ఆచంటలో ఇరుపార్టీల కార్యకర్తలతో మార్టేరు నుంచి ఆచంట వరకు వేల సంఖ్యలో జనంతో కిక్కిరిసిపోయే అవకాశం ఉంది. నామినేషన్‌ల ప్రక్రియ సజావుగా జరగాలంటే ఆచంటలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంది.

రామానాయుడు నామినేషన్

పాలకొల్లు, ఏప్రిల్ 16: ఈనెల 19వ తేదీన టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు నామినేషన్ వేయనున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు.

పాత మస్తర్ విధానం అమలు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16: ఉపాధి పథకంలో పాత మస్తర్ విధానం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఇటుకులగుంట వద్ద ఉపాధి పనులను సంఘ నాయకులతో కలసి మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ యాప్ వల్ల ఇటు ఉపాధి సిబ్బంది, కూలీలు ఇబ్బంది పడుతున్నారని వెంటనే పాత మస్తర్ విధానం అమలు చేయాలని కోరారు. ఉపాధి కూలీలు తుంగ లక్ష్మి, చేబోయిన మేరీ మాత, ఎస్. రత్నం తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం



భవన నిర్మాణ కార్మికులతో ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 16: కూటమి ప్రభుత్వంతో అందరికీ న్యాయం జరుగుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు, జట్టు యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. తామంతా వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి కోల్పోయామని కార్మికులు వివరించారు. సిమెంటు, ఐరన్, ఇసుక ధరలు పెరగడం వల్ల నిర్మాణ రంగంలో ఉపాధి కరువైందన్నారు. ఆరిమిల్లి మాట్లాడుతూ చంద్ర బాబు ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుందని, బీమా, పెళ్ళి కానుక వంటి పథకాలు అందిస్తామని, అన్న క్యాంటీన్లు తెరిపిస్తామని వివరించారు.

హిట్లర్ పాలన తలపిస్తోంది: కృష్ణతులసి



వ్యాపారులకు కరపత్రాలు అందిస్తున్న కృష్ణ తులసి

తణుకు, ఏప్రిల్ 16: జగన్ రెడ్డి పాలన హిట్లర్ పాలనను తలపిస్తోందని తణుకు టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. మంగళవారం తణుకు 19వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ, వ్యాపారులకు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఆరిమిల్లిని గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బసవా రామకృష్ణ, గండి రామకృష్ణ, అయినంపూడి శ్రీదేవి, దూలం విక్రమ్, చిట్టి పాప, ఇందిరాదేవి, రేవతి, తెలగల లక్ష్మి పాల్గొన్నారు.

ఎంఎస్ నారాయణ జయంతి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 15: సినీ నటుడు ఎంఎస్ నారాయణ జయంతి సందర్భంగా ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటు నివాళులర్పించారు. ఐదుసార్లు బెస్ట్ కమెడియన్‌గా నంది అవార్డులను సొంతం చేసుకున్నారన్నారు. 17ఏళ్లలో 700పై చిలుకు చిత్రాలలో నటించి ఓ రికార్డు నెలకొల్పారని ఆయన కమెడియన్‌గా ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి వీరేశలింగం పంతులుకు నివాళులు



భీమవరంలో కందుకూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 15: ఆధునిక ఆంధ్ర పితామహుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాదు అన్నారు. మంగళవారం తెలుగు నాటక రంగ దినోత్సవం, కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి కార్యక్రమాన్ని ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యునియన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో చాంద్ బాషా, కాటి వెంకటరత్నం, తిరుమాని చంటిరాజు, కామేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు.

తణుకు: సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో మంగళవారం మారుతీ జూనియర్ కళాశాలలో కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు నిర్వహించారు. సాహితీ సామ్రాజ్యం జిల్లా అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ కందుకూరి జయంతిని తెలుగు నాటక రంగ దినోత్సవంగా జరుపుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్మాణ రంగంలో సేవలందించిన ఇంటి వీరన్నను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, కేవీఎస్‌డీ ప్రసాద్, మోహనరావు, లక్ష్మణ కుమార్, నాగేశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.

భీమవరం టౌన్: కోటి లింగాలు కొట్టుకుపోయిన మిగిలింది ఒకే లింగమని అదే వీరేశలింగమని, సంఘ సంస్కరణలతో చరిత్రకే చరిత్ర సృష్టించిన కందుకూరి వీరేశ లింగం అని కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్ అన్నారు. క్విట్ ఇండియా స్తూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళాకారులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న వంగా నరసింహారావు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 16 : కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నటీనట సమాఖ్య అధ్యక్షుడు వంగా నరసింహారావు అన్నారు. తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ హాల్లో నటీ నట సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో నరసింహారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముందుగా కలియుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కళాకారులు యర్రంశెట్టి వెంకట రత్నం, వీరా వెంకట నరసిహారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుడాల హరిబాబు, మద్దాల వాసు, మేడికొండ శ్రీనివాసరావు చౌదరి, జక్కంపూడి కుమార్, గండేటి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా విశ్రాంత బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి ఐ.వెంకటేశ్వరరావు సామ్రాట్ అశోక్ ఏకపాత్రాభినయంతో అలరించారు.

• పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో మాంటిస్సోరీ స్కూల్లో జరిగిన తెలుగు నాటక రంగ దినోత్సవ కార్యక్రమానికి పరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కందుకూరి వీరేశలింగం జీవిత విశేషాలను పరిషత్ కార్యదర్శి మానాపురం సత్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా కళాకారుడు కొల్లి నరసింహ మూర్తిని ఘనంగా సత్కరించారు.

అమ్మవారి ఆలయానికి విరాళం

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 16 : పూలపల్లి గ్రామ దేవత ఘంటాలమ్మ, దేవుళ్ళ అమ్మవార్ల ఆలయ అభివృద్ధికి ప్రముఖ న్యాయవాది కర్రా జయసరిత రూ. 5000 విరాళం అందజేశారు. అమ్మవార్ల జాతర సందర్భంగా మంగళవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవార్లను దర్శించుకున్న జయసరిత విరాళం అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉనికెల శ్రీను, దొమ్మేటి శ్రీను, కడలి రామలక్ష్మి, కుసుమ జాన్సీ, హేమలత పాల్గొన్నారు.

బధిర పాఠశాలకు టీవీ అందజేత

భీమవరం టౌన్, ఏప్రిల్ 16: భీమవరం శ్రీవెంకటేశ్వర బధిర (మూగ చెముడు) పాఠశాలకు ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ స్మార్ట్ ఎల్ఈడీ టీవీని ఉచితంగా అందించారు. డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, పాఠశాల అధ్యాపకులు పద్మనాభ రాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16: రైతులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. కొమ్ముగూడెంలో వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామంలో చెరుకులో వచ్చే తెగుళ్లపై చర్చించి పరిష్కార మార్గాలు తెలిపారు. వ్యవసాయ విద్యార్థులు రవిచంద్రిక, సాయి ప్రత్యూష, సౌమ్య, శ్రావణి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

భీమవరంటౌన్, ఎప్రిల్ 16 : జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరు హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు, వికలాంగత్వం ఉన్న విభిన్న ప్రతి భావంతులకు ఈసారి కొత్తగా ఇంటివద్ద నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో భాగంగా కల్పించిన ఈ అవకాశాన్ని అర్హత ఉన్నవారు వినియోగించుకోవాలన్నారు. దీనికోసం వెంటనే ఫారం- 12(డి) ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవారితో తుది హోమ్ ఓటింగ్ జాబితాను తయారు చేయడం జరుగుతుందన్నారు. హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలనుకొనే వారికి వచ్చేనెల7,8 తేదీల్లో ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు మధ్య అవకాశాన్ని కల్పించదానికి ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, వీడియో గ్రాఫర్, మైక్రో అబ్జర్వర్‌తోపాటు బీఎల్‌ఓలు, పార్టీల ఏజెంట్లు కూడా దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి ఓటు తీసుకుంటారని తెలిపారు. దీనికోసం పాటించాల్సిన నిబంధనలను కచ్చితంగా పాటించడం జరుగుతుంది అన్నారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగే ఈ విధానంలో కూడా, దరఖాస్తు దారుని ఇంట్లో ప్రత్యేకంగా కంపార్ట్మెంట్ ఏర్పాటు చేసి, ఏకాంతంగా ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అవసరమైన పక్షంలో కుటుంబ సభ్యులను మాత్రమే వారికి సహకారం అందించేందుకు అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేసేలా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసిన వారికి, పోలింగ్ బూత్‌లో ఓటు వేసే అవకాశం ఉండదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు.